క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌ను కలిసిన శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ శ్రీనివాసపురం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో శ్రీనివాసపురం గ్రామ కమిటీ అధ్యక్షులు పోల్నాటి శ్రీనివాసరావు, మూడో వార్డు సభ్యులు పారేపల్లి నాగార్జున, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి పోల్నాటి వరప్రసాదరావు ఉన్నారు.

అధినేతతో ఆప్యాయ కలయిక



మాజీ సీఎం జగన్‌ను కలిసిన నాయకులు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు కరాటం కృష్ణ స్వరూప్ బుధవారం కలిశారు. అధినేతను కలిసిన వారిలో దండాబత్తుల ఖఘన్ కుమార్, గుద్దల సీతారామరాజు, దండా బత్తుల రాకేష్, ఏలికే పవన్ కుమార్, కురు హరీష్ ఉన్నారు.

ఘనంగా శనీశ్వర స్వామి ఇరుముడులు



శనీశ్వరస్వామి దీక్షా స్వాములు

వేలేరుపాడు: మండలంలోని శ్రీ భవాని మల్లేశ్వర ఆలయంలో మాల ధారణ చేసిన శ్రీ శనీశ్వర స్వామి దీక్ష స్వాముల ఇరుముడి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది జూలై 26న చేపట్టిన దీక్ష 19 రోజులు నియమనిబంధనలతో ప్రత్యేక పూజలు చేశారు. దీక్ష పూర్తికావడంతో ఇరుముడి సమర్పణకు విజయవాడలోని శ్రీ ప్రత్యేక శనీశ్వర స్వామి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. గత 25 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఈ దీక్ష చేపడుతున్నామని స్వాములు తెలిపారు.

అయ్యప్పకు పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా స్వామి వారికి పంచామృత అభిషేకాలు అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వారావుపేట రోడ్డులో ఉన్న వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో సుమారు 2,200 మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు అన్నప్రసాద వితరణ కమిటీ తెలిపింది. కార్యక్రమానికి దాతలుగా సుబ్రహ్మణ్యం, కంచర్ల నాగేశ్వరరావు, ఎం.హరిబాబు తదతరులు వ్యవహరించినట్టు పేర్కొంది.

సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ



సీతారామచంద్రస్వామి విగ్రహాలు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం సమీపంలో ఉన్న తూటిగుంట నిర్వాసిత గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కుంభారాధనం, సామి వారి దర్శనం, గోదర్శనం, శాంతి కల్యాణం, నీరాజనం, మంత్రపుష్ప కార్యక్రమాలు చేశారు. ఆలయానికి దిప్పకాయలపాడుకు చెందిన గన్నమనిని ప్రసాద్ ద్వారా గుడివాడ మండలం జంటకురు గ్రామానికి చెందిన పొట్లూరి స్వరాజ్యలక్ష్మి అనే మహిళ విగ్రహాలను అందజేశారని ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కన్నాపురం అటవీ శాఖ రేంజర్‌గా వలీ

కొయ్యలగూడెం: కన్నాపురం అటవీ శాఖ కార్యాలయ రేంజర్‌గా ఎస్‌కే వలీ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రేంజర్‌గా (ఇన్‌చార్జి) విధులు నిర్వహిస్తున్న జంగారెడ్డిగూడెం రేంజర్ దుర్గ బాబు నుంచి ఆయన బాధ్యతలను అందుకున్నారు. నర్సరీల అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తానని వలి పేర్కొన్నారు. దుర్గ బాబుకు వీడ్కోలు పలికారు.

మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ వర్షాలు



చింతలపూడి : రోడ్లపైకి చేరిన వర్షపు నీరు



బుట్టాయగూడెం : కురుస్తున్న వర్షం

జలమయమైన రహదారులు

చింతలపూడి : పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జన జీవనం స్తంభించింది. రోడ్లు జలమయమయ్యాయి. చెరువులు జల కళతో ఉట్టి పడుతున్నాయి. పలుచోట్ల వర్షపునీరు రోడ్లపై నుంచి ప్రవహించింది. భారీ వర్షాలకు పంట పొలాలు సైతం చెరువులను తలపిస్తున్నాయి. అధ్వానంగా ఉన్న రహదారులపై గోతుల్లో నీరు చేరి వాహనచోదకులకు ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. చింతలపూడి మండలంలోని మంగళవారం నుంచి కురుస్తోన్న వర్షాలకు పలు గ్రామీణ రహదారులు సైతం చిత్తడిగా మారాయి. తమ్మిలేరుకు వరద నీరు వచ్చి చేరింది. తమ్మిలేరు ప్రాజెక్టులో నీరు ప్రస్తుతం 332.33 అడుగులకు చేరిందని తమ్మిలేరు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. భారీ వర్షాలు మరో మూడు, నాలుగు రోజులు కొనసాగితే ఆంధ్రాకాల్వ ద్వారా వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరే అవకాశం ఉందని చెప్పారు.



ద్వారకాతిరుమల : కల్యాణ మండపాల వద్ద ప్రవహిస్తున్న వర్షపు నీరు

జలాశయాలు, చెరువుల్లోకి వరదనీరు

బుట్టాయగూడెం: అల్పపీడనంతో ఏజెన్సీ ప్రాంత గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కారుమబ్బులతో మోస్తారు వర్షం కురిసింది. సాయంత్ర నుంచి భారీ వర్షం ప్రారంభమైంది. రోడ్లన్నీ జలమయంగా మారాయి. ప్రధాన వీధుల్లో వ్యాపారాలు నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో గుబ్బల మంగమ్మతల్లి, జల్లేరు జలాశయంలోకి వరదనీరు వస్తోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుతం 212.10 మీటర్ల ఎత్తులో వరద నీరు ఉందని ఎంఐ అధికారులు తెలిపారు. పోగొండ రిజర్వాయర్ నీటి సామర్థ్యం 157 మీటర్లు దాటి వరదనీరు పొంగిపొర్లుతోంది.

శ్రీవారి క్షేత్రంలో భారీ వర్షం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో బుధవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ద్వారకాతిరుమల - భీమడోలు ప్రధాన రహదారిలోని పలు ప్రాంతాలు కాలువలను తలపిస్తున్నాయి. ప్రధానంగా కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలో, గొల్లగూడెం, పంగిడిగూడెం వద్ద రహదారిపై వర్షపు నీరు భారీగా నిలిచింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

పెళ్లి జనాలకు తప్పని ఇక్కట్లు

శ్రీవారి క్షేత్రంలో పెళ్లి జనాలకు ఇక్కట్లు తప్పలేదు. పెళ్లిళ్లకు మంచి ముహూర్తం కావడంతో రాత్రి అధికంగా వివాహాలు జరిగాయి. వర్షం కారణంగా పెళ్లి జనాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.



బుట్టాయగూడెం : బుట్టాయగూడెంలో కురుస్తున్న వర్షం



చింతలపూడి : రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



ద్వారకాతిరుమల : శివాలయానికి వెళ్లే మెట్లదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

పోలవరం రూరల్: సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ అన్నారు. సైబర్ నేరాలపై బుధవారం పోలవరం పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. ఈ నెల 6న ప్రభుత్వ హైస్కూల్ టీచర్‌కు ఐసీఐసీఐ నుంచి ఫోన్ చేస్తున్నామని, క్రెడిట్ కార్డు అప్‌గ్రేడ్ చేసుకోవాలని చెబుతూ లింక్ పంపారని, దీంతో టీచర్ లింక్‌లో వివరాలు నమోదు చేశారని ఎస్సై తెలిపారు. వెంటనే ఆమె బ్యాంకు ఖాతా నుంచి రెండు విడతలుగా రూ.1,05,608 నగు చోరీ చేశారని చెప్పారు. ఆమె వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో బ్యాంకుకు సమాచారం ఇచ్చి తదుపరి లావాదేవీలను నిలుపుదల చేయించామని తెలిపారు. ప్రజలు తెలియని కాల్స్‌కు స్పందించవద్దని, బ్యాంకింగ్ సేవలకు సంబంధించి బ్యాంకు అధికారిక వెబ్‌సైట్‌లు, బ్యాంకుల ద్వారానే పొందాలని ఆయన సూచించారు.

వాణిజ్య ఒప్పందాల జీఓ ప్రతుల దహనం

వేలేరుపాడు: ఈ నెల 9న దేశ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. వేలేరుపాడులో ఎస్‌కేఎం, రైతు కార్మిక సంఘాల కేంద్ర రాష్ట్రాల పిలుపు మేరకు కిట్ కార్పొరేట్ వ్యవసాయ రంగం నుంచి కార్పొరేటర్లు బయటకు వెళ్లాలని డిమాండ్ చేస్తూ, వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని జీఓ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ విరమించాలని, రైతులు, కౌలు రైతులు రుణాలు రద్దు చేయాలని, పదేళ్లు దాటిన ట్రాక్టర్లపై నిషేధం తొలగించాలని డిమాండ్ చేశారు. పంటలు పండే భూములను కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వరాదని, ఫ్రీ పెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్ రద్దు చేయాలని, పోలవరం నిర్వాసితులకు మెరుగైన పునరావసం కల్పించాలని కోరారు. ఉపాధి అవకాశాలు నూతన వ్యవసాయ మార్కెట్ చట్టం రద్దు చేయాలని, పంటల మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆదానికి అప్పగించిన ఎఫ్‌సీఐ గోడౌన్లన్నీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం, కార్మిక సంఘం, మహిళా సంఘం, యువజన సంఘం నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, కట్టడం వీరాస్వామి, కరటం ముత్యాలరావు, కటం రత్తమ్మ, మడి రంగమ్మ, షేక్ హుస్సేన్, మడి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



జీఓ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నిరసన ర్యాలీ

కుక్కునూరు: అమెజాన్, వోల్గా, ఉబర్ ఇతర విదేశీ కార్పొరేట్ కంపెనీలను దేశం విడిచి పోయే వరకు ప్రజలు పోరాటం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సోయం చందర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం ఏఐయూకేఎస్, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల పిలుపు మేరకు కుక్కునూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. నూతన జాతీయ మార్కెట్ చట్టాల జీఓ కాపీలను దగ్ధం చేశారు. రైతు, కార్మిక సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి పెంకె వీరబాబు, డివిజన్ నాయకులు నల్లగొప్పుల ఆదినారాయణ, నారేం కృష్ణ, కుప్పన సాయిరాం, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువజన ఉత్సవ పోటీలు

చింతలపూడి: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి సాంస్కృతిక కమిటీ ఆధ్వర్యంలో జాతీయ యువజన ఉత్సవ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. చింతలపూడి పరిధిలోని వివిధ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించగా, విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ గెలుపు, ఓటముల కంటే అనుభవం, ఆత్మవిశ్వాసం ముఖ్యమని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జేకే నరేంద్ర కుమార్, సెట్‌వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మి, ఎన్‌సీఎస్ యంగ్ ప్రొఫెషనల్ జి.ప్రవీణ్ కృష్ణ, సెట్‌వెల్ సూపరింటెండెంట్ కేజే కెన్నెడీ, సాంస్కృతిక సమన్వయకర్త బి.సరస్వతి, సాంస్కృతిక కమిటీ సభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

స్థానిక వాహనాల్లోనే మొక్కలు తరలించాలి

కుక్కునూరు: మండలంలోని జామాయిల్ నర్సరీల నుంచి ఇతర ప్రాంతాలకు మొక్కల రవాణాను స్థానిక వాహనాలతోనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం కుక్కునూరు లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్ల సంఘం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని బోనగిరి, రాయిగూడెం, ఇబ్రహీంపేట, గణపవరం, బంజరగూడెం, అల్లిగూడెం, వేలేరు ప్రాంతాల్లో ఉన్న జామాయిల్ నర్సరీల నుంచి మొక్కలను దేశంలోని పలు ప్రాంతాలకు బయట వాహనాలతో సరఫరా చేయిస్తున్నారని తెలిపారు. స్థానిక వాహనాలతో జామాయిల్ మొక్కలను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, స్థానిక డ్రైవర్లు, వాహనాల యజమానులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, లారీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నిర్మల వెంకటేశ్వర్లు, మహమ్మద్ వలీ పాషా, ఓగిరాల నాగరాజు, తాండ్ర నాగరాజు, కొప్పెర శ్రీను, గంజి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న డ్రైవర్లు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉందాం

బుట్టాయగూడెం: మాదకద్రవ్యాలతో జీవితం చిత్తవుతుందని, వీటికి యువత దూరంగా ఉండాలని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ సూచించారు. బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యం వినియోగం కరోనా వైరస్ కంటే అత్యంత భయంకరమైందన్నారు. డ్రగ్స్ వినియోగం సమాజంలో అతి పెద్ద సమస్యగా మారుతుందని, చెడు స్నేహాల వల్ల మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న యువత తమ భవిష్యత్‌ను తామే నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిశితంగా పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. అనంతరం ఈ సమస్య నిర్మూలనకు కృషి చేద్దామంటూ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న పీఓ రాములు నాయక్

మహాసభలను విజయవంతం చేయండి

కుక్కునూరు: ఆగస్టు 23న ఒంగోలులో నిర్వహించే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య కోరారు. బుధవారం సీపీఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు వరకా శ్యామల, అయితా సురేష్, కురాకుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అపోహలు వద్దు

కొయ్యలగూడెం: అవయవ దానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి వారికి అవగాహన కల్పించాలని ప్రముఖ అవయవదాత వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘం నాయకులు జీవీవీ ప్రసాద్ బుధవారం పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా ఆయన పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. అవయవదాన ప్రాముఖ్యతను ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు.

సాధారణ బదిలీలు వెంటనే చేపట్టాలి



నినాదాలు చేస్తున్న అధ్యాపకులు

చింతలపూడి: తమ సాధారణ బదిలీలు వెంటనే చేపట్టాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ జీసీటీఏ, జీసీజీటీఏ, జేఏసీ రాష్ట్ర పిలుపు మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బుధవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. జీఓ 42ను వెంటనే రద్దు చేయాలని, రీడిజిగ్నేషన్ ఫైల్‌ను ఆమోదించి వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్‌జేకే నరేంద్రకుమార్, బి.మదన్మోహన్‌రావు, కె.రత్నకుమారి, జి.జీవన మౌనిక, ఏలూరు జిల్లా జీసీటీఏ మహిళా కార్యదర్శి డి.విన్నితేజ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ద్వారకాతిరుమల: పురుగుల మందు తాగిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన గుత్తుల రామకృష్ణ (65) రెండేళ్ల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక పొలం కోసం తెచ్చిన పురుగుల మందును మంగళవారం మధ్యాహ్నం తాగాడు. వెంటనే రామకృష్ణను అయన కుమారుడు పాటియ్య హుటాహుటీన జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ రామకృష్ణ మృతి చెందాడు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొయ్యలగూడెం: మండలంలోని కన్నాయిగూడెం ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. పొంగుటూరు, కన్నాయిగూడెం గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ట్రాక్టర్లతో ర్యాలీ

లింగపాలెం: అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం నిధులను విడుదల చేయడంతో రైతులు ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. లింగపాలెం నుంచి ధర్మాజీగూడెం వరకు ర్యాలీ జరిగింది. అనంతరం స్ప్రేయింగ్ డ్రోన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.

స్వాతంత్ర్య వేడుకలకు స్కాట్ విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: ఏలూరులో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాలకు జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం జెడ్పీ హైస్కూల్ స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం ఇరపా గంగాదేవి తెలిపారు. ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే పరేడ్‌కు కామవరపుకోట రావికంపాడు జెడ్పీ హైస్కూల్, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం జెడ్పీ హైస్కూల్ స్కాట్ అండ్ గైడ్స్ విద్యార్థులు మొత్తం 20 మంది ఎంపికయ్యారని చెప్పారు. వీరు ఆగస్టు 15న నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారన్నారని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

కొయ్యలగూడెం: అంకాలగూడెం గ్రామానికి చెందిన కూనపోము రవికి వెన్నుపూస చికిత్స నిమిత్తం మానవత సంస్థ బుధవారం రూ.6 వేలు అందజేశారు. ఎస్‌కే అమీర్ భాష, ఎస్‌బీజీ శేఖర్, అధ్యక్షుడు మందపాటి రామకృష్ణ, సెక్రటరీ చంటిబాబు, కోశాధికారి చవ్వా రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి వితరణ



విద్యార్థిని దుర్గకు నగదు అందిస్తున్న సత్యనారాయణ

కొయ్యలగూడెం: అంకాలగూడెంకు చెందిన కె.దుర్గకి నర్సింగ్ చదువు నిమిత్తం రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాజేటి సత్యనారాయణ చేతుల మీదుగా రూ.30 వేలు బుధవారం ఆమె ఇంటి వద్ద అందజేశారు. పేద విద్యార్థులను ఆదుకోవడానికి కృషి చేస్తామని మాజేటి తెలిపారు. చోడి పిండి సుబ్రహ్మణ్యం, తోట వెంకటేశ్వరరావు, కనిగళ్ల శ్రీరామచంద్రమూర్తి, జి.రామ్మోహన్, ఎస్‌కే అమీర్ భాష, మద్దు గోపి, చిరవూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పంద్రాగస్టు పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. ప్రకాశం డిగ్రీ కళాశాల నుంచి భారీగా విద్యార్థులు త్రివర్ణ పతాకంతో జాతీయ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ద్వారకాతిరుమల: మండలంలోని వేంపాడు గ్రామంలో బుధవారం రాత్రి ఒక తాటాకిల్లు దగ్ధమై, గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇంట్లో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెండ్లి మధు గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ తన తాటాకు ఇంట్లో ఉంటున్నాడు. ఏం జరిగిందో తెలియదు గాని రాత్రి ఇంటికి నిప్పు అంటుకుంది. కొద్దిసేపటికి ఇంట్లోని సిలిండర్ పేలింది. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న భీమడోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో మధు వెనుక శరీర భాగం కాలిపోయింది. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.